క్లుప్తంగా

ప్రమాదకర గుంతను పూడ్చివేయాలి



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చి వేయాలని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి గుంత ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ గుంత వర్షాకాలంలో నిండిపోవడం వల్ల ఆడుకుంటూ వచ్చిన విద్యార్థులు ఇందులో పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇకనైనా అధికారులు ఎలాంటి ప్రమాదం జరగక ముందే గుంతను పూడ్చివేయాలని కోరారు.

ఆస్పత్రిలో 24 గంటల సేవలందించాలి

రుద్రూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని మైనారిటీ హక్కుల పోరాట సమితి సభ్యుడు ఇర్ఫాన్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాత్రి వేళ తీవ్ర అనారోగ్య పరిస్థితులు ఎదురైతే బోధన్ పట్టణానికి వెళ్లాల్సి వస్తోందని అన్నారు. మండలంలో ఆర్ఎంపీ, పీఎంపీలు తప్పా ఒక్కరు కూడా ఎంబీబీఎస్ వైద్యుడు లేరని దీంతో ఆటో కిరాయి రూ. ఐదు వందల వరకు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో పాటు సకాలంలో వైద్యసేవలు పొందలేకపోతున్నారని వాపోయారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి రుద్రూర్‌లో 24 గంటల వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు.

అటవీ ప్రాంతంలో సీడ్ బాల్స్



వర్ని(మోస్రా): మోస్రా అటవీ ప్రాంతంలో సిరివెన్నెల గ్రీన్ సొసైటీ నిజామాబాద్, లయన్స్ క్లబ్ మోస్ర ఆధ్వర్యంలో విత్తన బంతులను ఆదివారం చల్లారు. అటవీ ప్రాంతంలో జంతువులకు ఆహారం, పర్యావరణ పరిరక్షణకు అటవీ ప్రాంతంలో పండ్ల విత్తనాలను చల్లినట్లు సొసైటీ వ్యవస్థాపకుడు జనార్దన్ వెల్లడించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వినయ్, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీకాంత్, త్రినాథ్ గౌడ్, వరప్రసాద్, రవి, రాజేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బాల్కొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ ముప్కాల్ నూతన కార్యవర్గాన్ని ముప్కాల్ మండల కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ముల శ్రీనివాస్, కార్యదర్శిగా జక్కుల శ్రీనివాస్, కోశాధికారిగా గడ్డం సురేశ్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోర్తాడ్: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు రాజేశ్వర్‌కు గుండెపోటు సోకి చికిత్స పొందుతున్నాడు. అతని కుటుంబానికి పార్టీ తరఫున రూ.5 వేల సాయాన్ని పార్టీ నాయకులు ఆదివారం అందించారు. నాయకులు కైలాస్, మహేశ్, ఉమేశ్, ఇందూరి రాజు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రుద్రూర్: కోటగిరి ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సునీతాశ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నవనాథ గుట్టపై పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని భవనం

- కొనసాగుతున్న కేజీబీవీ పనులు
- కింది అంతస్తు అప్పగించాలంటున్న విద్యార్థులు
- పక్కా భవనం లేక అవస్థలు



మెండోరాలో నిర్మించిన కేజీబీవీ కొత్త భవనం

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రారంభానికి నోచుకోవడం లేదు. భవన నిర్మాణ పనులు పూర్తి దశకు చేరినా అధికారుల నిర్లక్ష్యంతో నూతన భవన అప్పగింతలు కావడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన మండలాల ఏర్పాటులో మెండోరా మండల కేంద్రంగా ఏర్పడింది. అనంతరం మండలానికి కేజీబీవీని కేటాయించారు. కొన్నాళ్లు మండల కేంద్రంలో కేజీబీవీని నిర్వహించారు. అద్దె భవనం లేక పోవడంతో బుస్సాపూర్‌కు తరలించారు. మూడేళ్లుగా అక్కడే కేజీబీవీ కొనసాగింది. 2021లో గత ప్రభుత్వం మండల కేంద్రంలో భవన నిర్మాణానికి రూ. 3 కోట్ల నిధులను మంజూరు చేసింది. అదే ఏడాది పనులను ప్రారంభించింది. కానీ నాటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతూ వస్తోంది. ప్రస్తుతం కింది అంతస్తులో పనులు పూర్తయ్యాయి. పైఅంతస్తులో ఫ్లోరింగ్ బండల పనులు సాగుతున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభానికి సిద్ధమవుతుందని విద్యార్థులు ఆశించారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో అలా జరగలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై పక్షం రోజులు గడిచినా ఇప్పటికి భవనం అప్పగింతపై స్పష్టత రాలేదు. బుస్సాపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతోంది. కానీ అక్కడ చినుకు పడితే చిత్తడే అన్నట్లుగా మారింది. దీంతో విద్యార్థులు ఆ భవనంలో ఉండి చదివేందుకు జంకుతున్నారు. దీంతో కొందరు విద్యార్థులు కేజీబీవీని వదిలి వెళ్తున్నారు. ఇకనైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి కేజీబీవీని నూతన భవనంలోకి మార్పు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పదిహేను రోజుల్లో..

నూతనంగా నిర్మించిన కేజీబీవీ భవనాన్ని అప్పగించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. వారు మరో పదిహేను రోజుల్లో అప్పగిస్తామని తెలిపారు. కింది అంతస్తు భవనం అప్పగించినా విద్యార్థులు ఉండేందుకు సిద్ధంగా ఉన్నారు.

– పద్మ, ప్రత్యేకాధికారిణి, కేజీబీవీ, మెండోరా

రసాభాసగా మహాజన సభ



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీరామ్



సొసైటీ డైరెక్టర్లతో వాగ్వాదానికి దిగిన రైతులు

పెర్కిట్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీలో రైతుబంధు పథకంపై రైతుల అభిప్రాయం కోసం ఆదివారం నిర్వహించిన ప్రత్యేక మహాజన సభ సమావేశం రసాభాసగా సాగింది. సొసైటీ చైర్మన్ పెంట భోజారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న రైతులు ఎరువులు సకాలంలో ఇవ్వక పోవడంతో ఇతర సొసైటీలకు వెళ్లి తీసుకొచ్చుకునే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. పాలకవర్గం అసమర్థత వల్లే ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెర్కిట్ సొసైటీతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని పాలకవర్గ సభ్యులు వెంటనే రాజీనామ చేయాలని పట్టుబట్టారు. సొసైటీ ఆదా య, వ్యయాలపై జరిగిన చర్చ వాడివేడిగా సాగింది. సొసైటీ ఆదాయం రూ.18 లక్షలు ఏమయ్యాయని రైతులు పాలకవర్గాన్ని ప్రశ్నించారు. గత పాలవర్గం చేసిన అప్పులను తీరుస్తున్నామని పాలకవర్గ సభ్యులు వెల్లడించారు. తాము సొసైటీ ద్వారా ధాన్యం విక్రయించగా వచ్చిన రూ.18లక్షల ఆదాయంతో గత పాలకవర్గం చేసిన అప్పును ఎలా తీరుస్తారని పాలకవర్గ సభ్యులను నిలదీశారు. ఇతరులు చేసిన అప్పును రైతులపై భారం మోపుతున్నారని రైతులు ఆరోపించారు. దీంతో సమావేశంలో రైతులు, పాలకవర్గ సభ్యులు ఒకరినొకరు దుర్భాషలాడుతూ దూషించుకున్నారు. అధికారు లు కలుగజేసుకుని నచ్చజెప్పారు. అనంతరం ఐదెకరాలు కలిగిన రైతులకు రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింప చేయకూడదని రైతులు తీర్మాణం చేశారు. రైతుల అభిప్రాయాన్ని పైఅధికారులకు తెలియజేయనున్నట్లు ప్రత్యేక అధికారి శ్రీహరి వెల్లడించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



పద్మశాలి ప్రతినిధులను సన్మానిస్తున్న సభ్యులు

ఆర్మూర్‌టౌన్: పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, కోటార్మూర్, పెర్కిట్ పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన పద్మశాలి ప్రతినిధులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాద్రి, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈరవత్రి రాజశేఖర్, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి ధర్మపురి, ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షుడు సునీల్‌ను సన్మానించారు. అనంతరం దత్తాద్రి మాట్లాడుతూ.. రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో పద్మశాలి నాయకులు పోటీచేసి గెలుపొందాలన్నారు. పద్మశాలి నిరుపేదలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి ప్రసాద్, మామిడిపల్లి ప్రెసిడెంట్ గుజ్జెటి రాము, బాస రవీందర్, నర్సయ్య, రాజేందర్, పద్మయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌కు నివాళులు



నివాళులు అర్పిస్తున్న ఏర్గట్ల వాసులు

మోర్తాడ్: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్‌కు ఏర్గట్ల గ్రామస్తులు ఆదివారం నివాళులు అర్పించారు. తమ గ్రామంలో పుట్టి రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ముద్ర వేసిన డీఎస్ గ్రామానికి వన్నె తెచ్చారని కొనియాడారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ ఆధ్వర్యంలో డీఎస్ చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. డీఎస్ తమ గ్రామాభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



ఉత్తమ విద్యార్థులను సన్మానిస్తున్న సభ్యులు

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని క్షత్రియ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. ఆర్మూర్ క్షత్రియ కల్యాణ మండపంలో సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి ప్రకాశ్, బారడ్ గంగా మోహన్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థుల ప్రతిభా పురస్కార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల ఆలోచనల మేరకే తల్లిదండ్రులు ఇష్టమైన కోర్సుల్లో చేర్పించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థులను పూలమాలలు, శాలువా, ప్రశంసా పత్రం, మెడల్స్‌తో ఘనంగా స న్మాననించారు. కార్యక్రమంలో సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పండిత్ ప్రేమ్, కౌన్సిలర్ ఖాందేశ్, పడాల్ గణేశ్, సాత్‌పుతే శ్రీనివాస్, యువజన సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు సాత్‌పుతే సంతోష్, దుమాని నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛ సమైక్య కార్యక్రమం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సభ్యులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు స్వచ్ఛ కాలనీ–సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఇటివల మృతి చెందడంతో కమిటీ సభ్యులు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం కమిటి అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాలనీ సభ్యులు వర్షాలను దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ కవర్లను చెత్త బుట్టల్లోనే వేయాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు కొక్కెర భూమన్న, కమలాకర్, రాజు, గడ్డం శంకర్, ఎల్‌టీ కుమార్, సతీశ్, గణేశ్, భూమయ్య, సాయన్న, రాజ్ కుమార్, రవి, బబ్లూ, అవేజ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



ఆలూర్‌లో గంగాజలాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు



ముప్కాల్ మండలం కొత్తపల్లిలో..



పచ్చలనడ్కుడలో..

పెర్కిట్/ బాల్కొండ/వేల్పూర్: ఆలూర్ మండల కేంద్రంలో గ్రామ కమిటీ కమిటి సభ్యులు గ్రామ దేవతలకు ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. ఎస్సారెస్పీ పరివాహక ప్రాంతం నుంచి తీసుకొచ్చిన గంగా జలాలతో గ్రామస్తులు ఊరేగింపు చేపట్టి గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నలిమెల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, వీడీసీ సభ్యులు గంగాధర్, మధు, శేఖర్, వినోద్, నవాతే గంగాధర్, అనిల్, రమేశ్ పాల్గొన్నారు. ముప్కాల్ మండలం కొత్తపల్లి, మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామాల్లో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గురడిరెడ్డి సంఘం, సహకార సంఘం ఆధ్వర్యంలో గోదావరి నుంచి జలాలను తీసుకొచ్చారు. గ్రామంలోని ఆలయాల్లో అభిషేకాలు చేపట్టారు. ముప్కాల్ మండలం రెంజర్లలో గ్రామ దేవతలకు సోమవారం జలాభిషేకం నిర్వహించనున్నట్లు వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు గ్రామదేవతలకు గోదావరి నీటితో జలాభిషేకం నిర్వహించారు.

వరుణ దేవా.. కరుణించ రావా..

వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగా పండాలని దొంకేశ్వర్ వీడీసీ, గ్రామ ప్రజలు కలిసి ఆదివారం గంగనీళ్లకు వెళ్లారు. చేపలు పట్టే వలలతో ఊరేగింపుగా వెళ్లి గోదావరి ఒడ్డున శివ లింగానికి, గ్రామ దేవతలకు నదీ జలాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పస్కరాజులకు మొక్కులు తీర్చుకుని వనభోజనాలు చేశారు.

–దొంకేశ్వర్(ఆర్మూర్)




గ్రామాల్లో బోనాల పండుగ



చందూరులో బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



బోధన్‌లో..



బోధన్‌టౌన్/ వర్ని(చందూర్): బోధన్ పట్టణంలోని మున్నూరుకాపు, యాదవ, గాండ్ల తేలిక కులాల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోనాలను ఊరేగించి మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా పడాలని ప్రతి ఏడాది బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు సంఘ సభ్యులు పేర్కొన్నారు. చందూర్ మండల కేంద్రంలో మహాలక్ష్మి అమ్మవారి పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ఊర పండుగ

ఆర్మూర్ టౌన్: పట్టణంలో సర్వ సమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, ఆరు పంతల సదర్లు, పెద మనుషుల ఆధ్వర్యంలో ఊర పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. గుండేటి మహేశ్, చిట్టి శ్రీనివాస్, దోమకొండ రాజు, నల్ల లింగన్న, దొడ్ల గోపాల్, సిద్ధాపురం లింగన్న పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం మెరుగు



కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఎడపల్లి: విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రంతో ఆరోగ్యం మెరుగవుతుందని జిల్లా జడ్జి సునీతా కుంచాల అన్నారు. ఆదివారం మండలంలోని పోచారంలో నిర్వహించిన విపశ్యన ధ్యాన కేంద్రంలో జడ్జితో పాటు పలువురు పాల్గొన్నారు. అనేక మానసిక, శారీరక సమస్యలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతర్జాతీయ గుర్తింపు కలిగిన ధ్యాన కేంద్రం జిల్లాలో ఉందని దీనిని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో విపశ్యన పరిచయ కార్యక్రయం నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

వేడుకలకు తరలి రావాలి



బోధన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే దండోర రజతోత్సవాలకు మాదిగ, ఉపజాతి కులాలు అధిక సంఖ్యలో తరలి రావాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రతినిధి విద్యాసాగర్ పిలుపునిచ్చారు. సాలూర మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం ఎదుట దండోర రజతోత్సవ వేడుకల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ప్రధాన డిమాండ్‌తో సుదీర్ఘకాలంగా మహోన్నతమైన ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని, ఈ ఉద్యమంలో 12 మంది అమరులయ్యారని గుర్తు చేశారు. వేడుకలకు విజయవంతం చేయాలని కోరారు. నాయకులు లింబూరి లక్ష్మణ్, మందర్న నాగురావ్, చంటి, సుభాష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వర్ని: మండలంలోని సిద్ధాపూర్‌లో నీటి ఎద్దడి తీర్చేందుకు పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నీటి శుద్ధికరణ ప్లాంటును చైర్మన్ ఎల్లారెడ్డి ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడితోపాటు స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్లాంటును ప్రారంభించినట్లు పే ర్కొన్నారు. గుడుకుంట్ల శ్రీనివాస్, పైడిమల్ ల క్ష్మీనారాయణ, గాజీరామ్, కిషన్ పాల్గొన్నారు.

మహానంది జాతీయ పురస్కారం అందుకున్న లక్ష్మి



పురస్కారం అందుకుంటున్న లక్ష్మి

బోధన్‌రూరల్: తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా అందజేసిన మహానంది జాతీయ పురస్కారాన్ని ఎరాజ్‌పల్లికి చెందిన కుర్రోళ్ల లక్ష్మి అందుకున్నారు. కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మికి హాస్య కిరిటి సినీ నటులు ఆర్ఎస్ నందా చేతులు మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వలబోజు మోహన్‌రావు పేర్కొన్నారు. జానపదకళా రంగంలో విశిష్టమైన సేవలను అందించినందుకు గాను ఈ అవార్డు లభించనట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు తనకు రావడం ఎంతో సంతోషంగా ఉందని లక్ష్మి తెలిపారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్‌-1 –	కల్కి ఏడి–2898 (తెలుగు) – 9.30, 4.15, 11.00 మహారాజ (తెలుగు) – 1.15, 8.00
స్క్రీన్‌-2 –	కల్కి ఏడి–2898 (తెలుగు) – 8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్‌-3 –	కల్కి ఏడి–2898 (తెలుగు) – 10.05, 1.50, 5.35, 9.20
స్క్రీన్‌-4 –	కల్కి–2898 (తెలుగు) – 11.05, 2.50, 6.35, 10.20

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?

- ఆరు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట సమయం



పిప్రి నుంచి మగ్గిడి వెళ్లే మార్గంలో గుంతల మయంగా మారిన రోడ్డు

పెర్కిట్: ఆర్మూర్ మండలం పిప్రి నుంచి అమ్దాపూర్, మగ్గిడి, ఖానాపూర్ గ్రామాలతో పాటు గోదావరి నదీ తీరానికి వెళ్లే మార్గం పూర్తిగా గుంతలమయంగా మారింది. సుమారు ఆరు కిలో మీటర్ల మేరా 60 గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు గుండా వాహనాలు నడపడం కష్టంగా మారింది. పిప్రి నుంచి గోదావరి నది తీరం వరకు ఉన్న ఆరు కిలో మీటర్లు ప్రయాణించడానికి అరగంట సమయం పడుతోంది. ఖానాపూర్, మగ్గిడి, అమ్దాపూర్ గ్రామస్తులు పిప్రి మీదుగా ఆర్మూర్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా గ్రామాల ప్రజలతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. గుంతలు ఉండడంతో ప్రయాణం దుర్లభంగా మారింది. సుమారు ఆరు కిలో మీటర్ల మేరా రోడ్డుపై 60 గుంతలు ఏర్పడ్డాయి. గుంతలమయమైన రోడ్డుపై వాహనాలు నడపడం కష్టంగా మారింది. గుంతల్లో పడి వాహనాలు తరచూ మరమ్మతులకు గురువుతున్నాయి. అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఆర్మూర్‌కు చేరుకోవడం గగనంగా మారుతోంది. గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిదులు మంజూరు చేసినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్యూరింగ్ ప్రారంభం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువ ఆధునీకరణలో భాగంగా చేపడుతున్న పనులకు వాటర్ క్యూరింగ్ చేపట్టకపోవడంపై సాక్షి దిన పత్రిక శుక్రవారం 'క్యూరింగ్ మరిచారు' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు ఆదివారం వాటర్ ట్యాంకర్‌తో నీటి క్యూరింగ్ చేపట్టారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్..

